ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- రాళ్లు తేలి ప్రమాదకరంగా . దాన్యంపాలెం–రావిగూడెం రోడ్డు
- నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా నిర్మాణం

అడ్డతీగల: మండలంలోని ధాన్యంపాలెం–రావిగూడెం రోడ్డుకు మోక్షం లభించడం లేదు. రాళ్లు తేలిన రోడ్డులో నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని అడ్డతీగల మండలం రావిగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకుంటే 2023 సెప్టెంబర్ 4న ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.50 కోట్లు కేటాయించి ధ్యాన్యంపాలెం–రావిగూడెం మధ్య 3 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ భూమి పూజ చేశారు. రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. మట్టి పనులు చేపట్టి, కంకర రోలింగ్ చేశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. **తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో రహదారి నిర్మాణం ముందుకు కదలడం** లేదు. ప్రస్తుతం రోడ్డు అంతా రాళ్లు లేచిపోయాయి. కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా తయారైంది. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించాలన్నా భయాందోళన చెందుతున్నారు. రాళ్లు తేలిన రోడ్డుపై వాహనాలతో జారి పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే నిర్మాణం పూర్తి చేస్తాం..

ఉపాధి హామీ నిధులు విడుదల కాగానే ధాన్యంపాలెం–రావిగూడెం గ్రామాల మధ్య చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. ఎనిమిది నెలలుగా నిధులు విడుదల కాలేదు. అందుకే నిర్మాణం ముందుకు సాగలేదు.

– నాగరాజు, ఐటీడీఏ డీఈ



రాళ్లు లేచిన ధాన్యంపాలెం–రావిగూడెం రోడ్డు దుస్థితి

క్లుప్తంగా

వెయ్యి ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యం



ఏపీవో అప్పలరాజు

కొయ్యూరు: ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో పండ్ల మొక్కలను పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధి హామీ ఏపీవో అప్పలరాజు తెలిపారు. పంచాయతీకి 31 ఎకరాల చొప్పున 33 పంచాయతీలలో మొక్కలు అందజేస్తామన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి ఎవరికైతే మొక్కలు కావాలో రైతుల వివరాలు తీసుకుంటామన్నారు. వచ్చే నెలలో గోతులు తీయిస్తామని చెప్పారు. జీడి, జాఫ్రా, నిమ్మ మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెంచేందుకు రైతులు ఆసక్తి చూపిస్తే అందిస్తామని చెప్పారు. మొక్కలు కావలసిన రైతులు సంబంధిత పంచాయతీల వీఆర్పీలను సంప్రదించాలన్నారు. ఫారం పాండ్లు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. వాటి చుట్టూ మొక్కలు వేసేందుకు చూస్తున్నామన్నారు.

రేషన్ డిపో పరిశీలన



రేషన్ పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: డీలర్లు, సేల్స్‌మేన్లు త్వరితగతిన రేషన్ పంపిణీ చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోఆర్డీ పాపారావు ఆదేశించారు. వారు మంగళవారం గూడెంలో రేషన్ షాపును పరిశీలించారు. రేషన్ పంపిణీ తీరును తనిఖీ చేశారు. 65 సంవత్సరాలు దాటిన అందరికి కూడా ఇంటికి తీసుకెళ్లి రేషన్ ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై అవగహన

వీఆర్‌పురం: ప్రభుత్వ పథకాలపై వీఆర్‌పురం చింతూర్ మండలంలో సుమారు 40 గ్రామాల గిరిజన యువతకు ఏఎస్‌డీఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా రూపొందించిన వాట్సప్ ద్వారా ప్రభుత్వ పథకాలను ఎలా అప్లయ్ చేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంయూ ఆన్‌లైన్‌లో ఆధార్, ఎన్ఆర్ఈజీఎస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పీఎం కిషన్, సదరం, బర్త్, మ్యారెజ్ సర్టిఫికెట్ ఎలా పొందాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నరేంద్ర, ప్రాజెక్టు మేనేజర్ చల్లారి సాయి చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మ జాతర



చింతాలమ్మ తల్లికి బోనాలు సమర్పించడానికి వెళుతున్న మహిళలు

అడ్డతీగల: మండలంలోని వీరభద్రపురంలో మంగళవారం చింతాలమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. గ్రామంలోని మహిళలంతా బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి అచ్చియ్యపేట జంక్షన్ వద్ద కొలువై ఉన్న చింతాలమ్మ అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వ్యవసాయంలో మెలకువలు పాటించాలి



రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ సీతమ్మ, అధికారులు, నేతలు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు వ్యవసాయంలో తప్పకుండా మెలకువలు పాటించాలని ఎంపీపీ అరిసెల సీతమ్మ కోరారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలో మంగళవారం గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలతో పాటు మందులను ఎంపీపీ సీతమ్మ, అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులంతా వ్యవసాయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పంటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ గంగాధర్, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసబాబు, నాయకులు జగబంధు, రామస్వామి, సన్యాసమ్మ, జయదేవ్, సచివాలయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

రావికమతం : గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి సూచించారు. కొత్తకోట పీహెచ్‌సీని మంగళవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. ఆశాలు, పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో ఓపి పెంచాలని బీపీ, సుగర్ రోగులను గుర్తించి మందులు అందించే బాధ్యత తీసుకోవాలన్నారు.గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

హామీలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



బందం శ్రీదేవి



పండా వెంకటలక్ష్మి

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం అడ్డతీగల్లో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏడాది కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఒక పక్క రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగిపోతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా పార్టీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏడాది పాలనలోనే ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేతకు ఆదేశాలు



రెవెన్యూ అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని పెదలబుడు పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించి, గిరిజనేతరుడు నిర్మించిన దుకాణాన్ని కూల్చివేయాలని రెవెన్యూ అధికారులకు అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ గోవిందు, రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. సులభ్ కాంప్లెక్స్ తొలగించి అక్రమంగా దుకాణం నిర్మించారని రెవెన్యూ అధికారులు గిరిజనేతరుడైన శివకు నోటీసు జారీ చేసి, దుకాణం సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గోడకు అతికించిన నోటీసును తొలగించి, షట్టర్‌కు వేసిన తాళాలు బద్దలుగొట్టి దుకాణం తెరవడంపై ఎమ్మెల్యే, రెవెన్యూ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపు నిర్వాహకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు మత్స్యరాజు, బలరామ్, వీఆర్‌వోలు బి.బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



జి.మాడుగులలో రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ అప్పలరాజు

జి.మాడుగుల: ఆదివాసీ గిరిజన రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తున్న సబ్సిడీ వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లంబోరి అప్పలరాజు, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి కోరారు. మండలంలో జి.మాడుగుల గ్రామ సచివాలయంలో మంగళవారం 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు(జీలుగు) పంపిణీ చేశారు. పలు గ్రామాల రైతులకు 50 శాతం సబ్సిడీపై పవర్ వీడర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పాత్రుడు, ఏఈవోలు ప్రశాంత్ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చిరుధాన్యాల విత్తనాల పంపిణీ

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి పంచాయతీ కేంద్రంలో శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో పరిధిలోని రైతులకు భారతీయ చిరుధాన్యాల సంస్థ(ఐఐఎంఆర్) ఏటా అందిస్తున్న రాగులు, సామలు, కొర్రలు, ఊదలు, జొన్నలు, గంటెలు వివిధ రకాలు చిరుధాన్యాలను మంగళవారం శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐసరం హనుమంతరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐఎంఆర్ ప్రతినిధి డాక్టర్ రఫీ, ఎఫ్‌పీవో సభ్యులు పాల్గొన్నారు.



పెదలోచలిలో విత్తనాలు అందిస్తున్న మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో హనుమంతరావు



రైతులకు రాయితీ విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

డుంబ్రిగుడ: రాయితీపై వ్యవసాయ శాఖ అందిస్తున్న విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ కోరారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభంలో ముందుగా విత్తనాలు పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. పోతంగి పంచాయతీ సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ గీత, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్



జోలాపుట్టు మార్గంలో శ్రమదానంతో మొక్కలు తొలగిస్తున్న యూత్ సభ్యులు

ముంచంగిపుట్టు: రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారుల్లో కనీస చలనం లేకపోవడంతో యువత నడుం బిగించి, శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. గత రెండు నెలల వ్యవధిలో ఎనిమిది వాహన ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు మృతి చెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. దీంతో కించాయిపుట్టు బీఆర్ అంబేడ్కర్ యూత్ సభ్యులు మంగళవారం శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. సుమారుగా 5 కిలోమీటర్ల వరకు పిచ్చి మొక్కలను తొలగించారు. యూత్ సభ్యులు మహేష్, మహేంద్ర, బాలన్న, అనిల్‌కుమార్, సాయి, సురేష్, జగదీష్, అంబేడ్కర్, సత్తిబాబు పాల్గొన్నారు. యూత్ సభ్యులు చూపిన చొరవపై ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

6న కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం



కె.జె.పురంలో వేంకటేశ్వరస్వామి ఆలయం

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15వ వార్షిక కల్యాణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, సభ్యులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ ఉదయం స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. అంతకుముందు 5వ తేదీన అంకురార్పణ, విష్వక్సేన పూజ, పుట్టమట్టి తెచ్చుట, నవకలశస్నపణం, జరుగుతుందన్నారు. 6న ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు 12వ తేదీన ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ముగిసిన కనకదుర్గమ్మ ఉత్సవాలు



జోలాపుట్టులో అమ్మవారిని ముళ్ల ఉయ్యాలపై ఊరేగిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న జోలాపుట్టు గ్రామంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గత మూడు రోజులుగా సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని ముళ్ల ఉయ్యాలలో జోలాపుట్టు గ్రామంలో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరను చూసేందుకు అధికంగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సింగవరంలో సర్వేతో కలవరం



సింగవరంలో చేపట్టిన రోడ్డు ఆక్రమణల సర్వే

కొయ్యూరు: రెవెన్యూ అధికారులు రోడ్డు ఆక్రమణలపై మంగళవారం సింగవరంలో చేపట్టిన సర్వే ప్రజలను కలవరానికి గురిచేసింది. 1934లోనే బ్రిటిష్ పాలకులు ఆర్అండ్‌బీ రోడ్డును ఒక దగ్గర 50 అడుగుల వెడల్పు, మరో చోట 70 అడుగుల వెడల్పుగా నమోదు చేశారు. దానిని అనుసరించి రోడ్లు అక్రమణలపై సర్వే చేశారు. దీంతో చాలా మంది ఇళ్లు కూడా పోతున్నాయి. ఇలా ఇళ్లను కోల్పోతున్న వారిలో పేదలు ఎక్కువగా ఉన్నారు. ఒక్కో చోట ఇళ్లు, షాపులు కూడా పోతున్నాయి. 50 సంవత్సరాలుగా చాలా మంది నివాసం ఉంటున్నారు. ఇప్పుడు పాత రికార్డులు తీసి ఖాళీ చేయా లని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కనీసం పరిహారం కూడా ఇవ్వకుండా షాపులను ఖాళీ చేయాలని, లేదా కూల్చివేస్తామని చెప్పడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆక్రమణలను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నామన్నారు.

మాడుగులలో 6న జాబ్ మేళా

మాడుగుల : ఈ నెల 6వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం మాడుగులలో గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి పి.శ్రీనివాస్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి, కె.లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు, అద్దేపల్లి జగ్గారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లు

నాతవరం : మండల కేంద్రంలో మంగళవారం కోటమ్మ తల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈపోటీలకు 10 ఎడ్ల బళ్లు పాల్గొనగా పోటీలను ఉత్సవ కమిటీ సభ్యులు పైల పోతురాజు, శెట్టి లోవ, అపిరెడ్డి మాణిక్యం, పోలిరెడ్డి రాజు జివిరెడ్డి రాజుబాబు జెండా ఊపి ప్రారంభించారు. మొదటి స్థానంలో లెక్కలవానిపాలెం గ్రామానికి చెందిన పెద్ద పైడితల్లిమ్మ ఎడ్ల బండి నిలిచింది. రెండో స్థానంలో నాతవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి గోవింద్, మూడో స్థానంలో ఎల్.ఎల్.పట్నంకు చెందిన బండారు హేమతేజ, నాలుగో స్థానంలో ఎం.కోటపాడు గ్రామానికి చెందిన వీర ఆంజనేయ, ఐదో స్థానంలో నాతవరం గ్రామానికి చెందిన శెట్టి శ్రీను ఎడ్ల బళ్లు పోటీల్లో నిలిచాయని నిర్వహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.12వేలు, మూడో బహుమతి రూ. 10వేలు, నాలుగో బహుమతి రూ.8వేలు, ఐదో బహుమతి రూ.6వేలు చొప్పున అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అడ్డతీగలలో యోగాంధ్రలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి నరసింహులు

అడ్డతీగల: యోగా ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని **జిల్లా** పశు సంవర్ధక శాఖాధికారి సిహెచ్.చందాక నరసింహులు అన్నారు. అడ్డతీగల ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం సిబ్బందితో కలిసి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నిత్యం యోగా చేయడం మానసిక వికాసానికి అవకాశం ఉంటుందన్నారు. అడ్డతీగల ఏడీ గణేష్, పశువైద్యాధికారి తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

25 టన్నుల పశు దాణా సిద్ధం

అడ్డతీగల ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు 25 టన్నుల పశు దాణా సిద్ధంగా ఉందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సిహెచ్.చందాక నరసింహులు అన్నారు. 50 శాతం రాయితీపై దాణా పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 7న బక్రీదు సందర్భంగా గోవధను నిషేధించాలన్నారు.

ఇంటి వద్దకే రేషన్ విధానం రద్దు సరికాదు

ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు



అడ్డతీగల: ఇంటి వద్దకే రేషన్ విధానం రద్దు చేయడం సరికాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు అన్నారు. రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ ప్రజలకు భారంతో కూడుకున్నదన్నారు. ఉపయోగం లేని విధానాలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. గత ఐదేళ్లలో నిత్యావసరాలు తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు కలగలేదన్నారు. నేరుగా ఇంటి వద్దకే వచ్చి పేదలకు సరకులు సరఫరా చేసేవారన్నారు. గత టీడీపీ హయాంలో కూడా ఐదు ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి తమ పేరు పిలిచే వరకూ వేచి చూస్తూ ఉండేవారన్నారు. తీరా సరకులు ఇచ్చాక ప్రయాణంలో ఇల్లు చేరుకోవడానికి అనేక ప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఘనంగా మత్స్యమాడుగులమ్మ పండగ



అమ్మవారి పాదాలు, ఘటాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మత్స్యరాజు, భక్తులు



సంతబయలులో మత్స్య మాడుగులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల సంతబయలు గ్రామంలో మంగళవారం మత్స్యమాడుగులమ్మ అమ్మవారి ఇంటి పండగ ఘనంగా జరిగింది. ముందుగా నేరేడువలస, పి.జి.మాడుగుల గ్రామాల్లోని మత్స్యరాస వంశీయుల కుటుంబ సభ్యులు, ఇతర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలు, అమ్మవారి పాదాలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మత్స్య మాడుగులమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. వారపు సంతకు వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు, గ్రామ పెద్దలు పంతులరాజు, భీమ్‌రాజు, కిముడు వెంకటరమణ, వంశీ, చంద్రమణి, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీపై జీపు జాత



మాట్లాడుతున్న లోత రామారావు

వీఆర్‌పురం: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కోసం ఏజెన్సీ వ్యాప్తంగా జరుగుతున్న జీపు జాత యాత్ర మంగళవారం వీఆర్‌పురం మండలం సోములగూడెంకు చేరింది. జీపుజాతకు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యుడు లోత రామారావు మాట్లాడుతూ ప్రకటించిన మెగా డీఎస్సీలో షెడ్యూల్డ్ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. చోప్పల్లి, సోములగూడెం, సున్నవారిగూడెం, రేఖపల్లి గ్రామాల మీదుగా జీపుజాత కూనవరం చేరింది. అక్కడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ కోసం మాట్లాడకుండా మెగా డీఎస్సీలో 2 వేల పోస్టులు ఆదివాసీలకు వస్తాయంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అసత్య ప్రచారాలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్ సోయం చినబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పునెం ప్రదీప్ కుమార్, కారం సుందరయ్య, శ్రీరామమూర్తి, సర్పంచ్ కారం బుచ్చమ్మ, పునెం సరోజిని, పల్లపు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో డివిజన్ స్థాయి యోగాంధ్ర



గంగవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో కట్టా సింహాచలం డీఎస్‌పీ ప్రశాంత్ కుమార్

గంగవరం : మండల కేంద్రం గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో డివిజన్ స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని బుధవారం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎస్‌పీ ప్రశాంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమానికి రంపచోడవరం డివిజన్ స్థాయిలో అన్ని మండలాల నుంచి భారీగా ప్రజలను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏర్పాట్లను పరిశీలించిన పీవో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు హాజరు కావాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో లక్ష్మణరావు, ఎంఈవో–2 మల్లేశ్వరరావు, ఉపాధి ఏపీవో ప్రకాశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

8న జిల్లా రైతు సదస్సు



రైతు సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కూనవరం: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించనున్న జిల్లా రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆ పార్టీ కిషాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నోముల వెంకటరామారావు, జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య కోరారు. భీమవరంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సదస్సుకు కిషాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాలపాటి రవిరాజు, పార్టీ ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శి మఠం శాంతకుమారి, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ కారం దారయ్య, నోముల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కరక పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com